ఉచిత విద్య అమలయ్యేనా ..?

- అధికారుల పర్యవేక్షణ కరువు
- ఆర్‌టీఈ అమలుపై నిర్లక్ష్యం
- ఉచిత సీట్లనూ ఊడ్చేస్తున్నారు

శృంగవరపుకోట: పేదవర్గాల్లోని పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో 25 శాతం సీట్లు కల్పించి, వారికి నాణ్యమైన విద్య అందివ్వాలనే ఉద్దేశంతో చేసిన చట్టం ఆర్‌టీఈ సెక్షన్ 12(1)సి అమలు కావడం లేదు. ఉచిత విద్య మిథ్యగానే మారింది. ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాల ఒత్తిళ్లు భరించలేక.. మొర పెట్టుకున్నా తమ గోడువినే అధికారులు లేక తల్లిదండ్రులు తమ బిడ్డలను స్కూళ్లు మార్చి తీసుకుపోతున్నారు. రైట్ టూ ఎడ్యుకేషన్ (ఆర్‌టీఈ) సెక్షన్12(1)(సి) ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఆర్థికంగా వెనుకబడిన వారికి (ఈడబ్ల్యూసీ), వెనుకబడిన సమూహాలకు (డీజీ) కేటాయించాలి. తద్వారా విద్య, సామాజిక రంగాల్లో అసమానతల్ని తొలగించాలన్నది చట్టం ఉద్దేశం. ఉచిత విద్యకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు ఒక కిలోమీటర్ పరిధిలో.. 6 నుంచి 8 తరగతుల వారికి 3 కిలోమీటర్ల పరిధిలో ఉన్న పాఠశాలల్లో డ్రా పద్ధతిన సీట్లు కేటాయిస్తారు. వీరి ఫీజులను స్కూల్ ఖాతాకు ప్రభుత్వం జమ చేస్తుంది. ఇదిలా ఉంటే ఆర్‌టీఈ సెక్షన్ 12(1)సి ప్రకారం ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు ప్రవేశాలు కల్పించాల్సి ఉన్నప్పటికీ ఈ ఏడాది మాత్రం రాష్ట్ర ప్రభుత్వం ఒకటో తరగతిలో మాత్రమే విద్యార్థులకు ప్రవేశాలకు అనుమతించింది. ఫ్రీ సీట్ల వ్యవహారంపై మండల విద్యాశాఖాధికారి నర్సింగరావు వివరణ కోరగా.. ఇప్పటికే అన్ని స్కూళ్ల యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేసి ఫ్రీ సీట్లు పొందిన వారి నుంచి ఎటువంటి ఫీజులు వసూళ్లు చేయకూడదని స్పష్టం చేశామన్నారు. ఎవరైనా ఫీజుల కోసం ఒత్తిడి చేసినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఒత్తిడి చేసి వసూలు చేస్తున్నారు..

ఆర్‌టీఈలో ప్రైవేట్ స్కూళ్లలో సీటు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఫీజుల ఒత్తిళ్లు తప్పడం లేదు. ప్రవేశం కోసం వెళ్లిన విద్యార్థుల నుంచి మొత్తం ఫీజులు కట్టాలని ఒత్తిడి చేస్తున్నారు. కొన్ని స్కూళ్ల యాజమాన్యం ప్రభుత్వం ఇస్తామన్న రూ.6 వేలు మినహా మిగిలిన మొత్తం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి. దీంతో తల్లిదండ్రులు ప్రైవేట్ స్కూళ్లలో వచ్చిన ఫ్రీ సీట్స్ వదిలేసి సర్కారు బడులకు పోతున్నారు. ఇదే సమయంలో బుక్స్, యూనిఫార్మ్స్, అడ్మిషన్ ఫీజు, ప్రైవేట్ ఫీజు, ఎస్టాబ్లిష్‌మెంట్ చార్జీలు, గేమ్స్ ఫీజు, పేటీఏ ఫీజు, ఏవీ ఎక్విప్‌మెంట్ ఫీజు, ఎగ్జామ్ ఫీజు, స్టేషనరీ చార్జీల పేరుతో ఎల్‌కేజీ నుంచి టెన్త్ వరకు రూ. పది వేల నుంచి 30 వేల రూపాయల వరకు గుంజేస్తున్నారు.

నియోజకవర్గంలో ఉచిత సీట్లు పొందిన విద్యార్థుల వివరాలు

మండలం	ఫస్ట్ ఫేజ్	సెకెండ్ ఫేజ్	మొత్తం
ఎస్.కోట	53	12	65
ఎల్.కోట	13	11	24
వేపాడ	03	02	05
కొత్తవలస	50	73	123
జామి	15	11	26
మొత్తం	134	109	243



ఉచిత సీట్లకు ఎంపికైన విద్యార్థులు

స్కూల్ మార్చేశాను..



మా అబ్బాయి సూదికొండ షణ్ముఖ్‌కి ప్రైవేట్ స్కూల్‌లో ఫ్రీ సీటు వచ్చిందన్నారు. స్కూల్ వాళ్లు ఫీజు రూ.18వేలు కట్టాల్సి ఉంటుందన్నారు. అంత సొమ్ము కట్టుకునే స్థోమత లేక వేరే స్కూల్‌లో జాయిన్ చేసేశాను.

– సూదికొండ సునీత, విద్యార్థి తల్లి, శివరామరాజుపేట గ్రామం

ఫీజు కట్టలేక సర్కారు బడికి..



మా అబ్బాయికి గతేడాది ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఫ్రీ సీట్ వచ్చింది. ఐనా రూ.5 వేలు కట్టమన్నారని కట్టాం. ఈ ఏడాది రూ.12 వేలు కట్టమన్నారు. ఫీజులు కట్టలేక శ్రీనివాసకాలనీలోని గవర్నమెంట్ బడికి మార్చేశాం. ఫ్రీ సీట్ అని చెప్పి డబ్బులు వసూలు చేయడం సరికాదు. అధికారులెవ్వరూ పట్టించుకోవడం లేదు.

– వసంత యశోద, విద్యార్థి తల్లి, పెద్దవీధి, ఎస్.కోట.

సీటు లేదని డబ్బులడిగారు..



మా అబ్బాయి కొరువాడ అక్షయ్. ఓ ప్రైవెట్ స్కూల్‌లో 2వ తరగతి చదువుతున్నాడు. తొలి రెండేళ్లు అక్కడే చదివాడు. గతేడాది ఫ్రీ సీటు వచ్చిందన్నారు. చివరికి వచ్చేసరికి సీటు క్యాన్సిల్ అయ్యిందని చెప్పి రూ.9500 కట్టించుకున్నారు. ఎంతఓటికి చెబితే మిమ్మల్ని ఎవరు కట్టమన్నారన్నారు. ఈ ఏడాది అడిగితే ఫ్రీ సీటే కానీ రూ.10,500 కట్టాలన్నారు. బుక్స్‌కి రూ.4,950 తీసుకున్నారు.

– కొరువాడ రామారావు, విద్యార్థి తండ్రి, శివరామరాజుపేట గ్రామం

డబ్బులు వసూలు చేశారు..



మా అబ్బాయి రాడి ఉమామహేష్ గతేడాది ఓ ప్రైవేట్ స్కూల్‌లో యూకేజీ చదివాడు. ఈ ఏడాది ఫ్రీ సీట్ వచ్చిందన్నారు. స్కూల్‌కి వెళ్తే రూ. 6,500 కట్టమన్నారు. ఎందుకని అడిగితే ఫ్రీ సీట వల్ల మాకు లాభం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం డబ్బులు వేయకపోతే మొత్తం రూ. 13 వేలు కట్టాల్సి ఉంటుందని చెప్పారు. బుక్స్ కోసం రూ. 4,950 తీసుకున్నారు. గతేడాది జాయిన్ అయిన నా కొడుక్కి ఈ ఏడాది అడ్మిషన్ ఫీజు రూ.2,500 ఎందుకు వసూలు చేశారో అర్థం కావడం లేదు.

– రాడి గోపి, విద్యార్థి తండ్రి, రాజియ్యపేట గ్రామం

క్లుప్తంగా

రెగ్యులర్ చేయాలంటూ వినతి

గజపతినగరం: ఏపీఈపీడీసీఎల్ పరిధిలో కొన్నేళ్లుగా కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేస్తున్న తమను రెగ్యులర్ చేసి ఉద్యోగభద్రత కల్పించాలని పలువురు డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులందరూ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సమాన పనికి సమాన వేతనం కల్పించి.. దశల వారీగా రెగ్యులర్ చేయాలని కోరారు. దీనికి మంత్రి స్పందిస్తూ, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

సన్మానం



గణేష్ మాస్టారు దంపతులను సన్మానిస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ చినరాముునాయుడు, తదితరులు

వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ సోమవారం పదవీ విరమణ చేసిన జీవశాస్త్రం ఉపాధ్యాయుడు చింతల గణేష్ దంపతులను సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆకుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు వెంకట చినరాముునాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు ఎం.కస్తూరి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వేచలపు జగ్గుబాబు, ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ కింతాడ సత్యవతి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గణేష్ మాస్టారు విద్యార్థులకు చేసిన సేవలను కొనియాడారు.

మర్యాదపూర్వక కలయిక



సత్యవంతుడును సన్మానించిన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, మండల నాయకులు

వేపాడ: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బూత్ కమిటీ వింగ్ సెక్రటరీగా నియమితులైన దొగ్గ సత్యవంతుడు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును విజయనగరంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలతో కలసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జగ్గుబాబు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, నాయకులు దుల్ల మహేష్, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, నేతలు, అభిమానులు పాల్గొన్నారు.

మండల సర్వేయర్‌కు బదిలీ

దత్తిరాజేరు: మండల సర్వేయర్‌గా పని చేసిన సుబ్బారావుకు గజపతినగరం బదిలీ జరిగింది. దీంతో సహచర ఉద్యోగులు, తహసీల్దార్ విజయభాస్కర్, తదితరులు సుబ్బారావును సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సత్కరించారు. అలాగే వివిధ సచివాలయాల్లో పనిచేస్తున్న 12 మంది సచివాలయ సర్వేయర్లకు కూడా బదిలీ జరిగింది.

ఆర్‌ఈసీఎస్ ఎం.డిగా సన్యాసినాయుడు



చీపురుపల్లి: గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (ఆర్‌ఈసీఎస్) ఎం.డీగా (ఎఫ్‌ఏసీ) బి.సన్యాసినాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఆర్‌ఈసీఎస్ ప్రధాన కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కో ఆపరేటివ్ ఆడిట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు చీపురుపల్లి ఆర్‌ఈసీఎస్ ఎం.డీగా ఎఫ్‌ఏసీ బాధ్యతలు అప్పగించారు. ఇంతవరకు ఇక్కడ విధులు నిర్వహించిన పి.రమేష్ జిల్లా సహకార అధికారిగా కొనసాగుతున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు

గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామ క్షేత్ర సహాయకుడిపై (ఫీల్డ్ అసిస్టెంట్)సర్పంచ్ వర్రి పాపునాయుడు జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. పంచాయతీ తీర్మానం లేకుండా పనులు చేపడుతున్నాడని, వేతనదారులకు పక్షపాత వైఖరితో పనుల్లేకుండా చేస్తున్నాడని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

ఘనంగా ముత్యాలమ్మ పండుగ



ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు

గుర్ల: మండల కేంద్రంలో ముత్యాలమ్మ పండుగను గ్రామస్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఘటాలను గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. పండుగను రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యుడు ఇజ్జిరోతు ప్రసాద్ తెలిపారు. అమ్మవారికి మంగళవారం పసుపు, కుంకమలతో అభిషేకాలు చేస్తామన్నారు.

రైతుకు అండగా నిలవండి

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు

గజపతినగరం: వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యులు రైతులకు సహాయ, సహకారాలు అందిస్తూ అండగా ఉండాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గజపతినగరం వ్యవసాయ మార్కెట్ కమిటీని జిల్లాలో ఆదర్శ కమిటీగా తీర్చిదిద్దాలని సూచించారు. కమిటీ చైర్మన్‌గా పీవీవీ గోపాలరాజు, వైస్ చైర్మన్‌గా కోరాడ కృష్ణ, తదితరులు బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందుముందు గజపతినగరం మండలం కెంగువ గ్రామంలో 55 లక్షల రూపాయలతో రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ ఇటీవల నిర్మించిన ప్రాథమికోన్నత పాఠశాల భవనాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, మాజీ మంత్రి పడాల అరుణ, జనసేన నాయకుడు మద్రాపు సురేష్, ఎం.శ్రీధర్, ప్రదీప్‌కుమార్, కె.భాస్కర్, రామ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ రోడ్డుకు మోక్షం లేదా..?

- నిరసన వ్యక్తం చేసిన సీపీఎం, ఏపీ దళిత కూలీ రైతు సంఘ నాయకులు



అధ్వానంగా ఉన్న రోడ్డును చూపిస్తున్న సీపీఎం జిల్లా నాయకుడు చల్లా జగన్ , తదితరులు

వేపాడ: మండల కేంద్రంలోని వేపాడ రోడ్డుకు మోక్షం కల్పించరా అని సీపీఎం నాయకుడు చల్లా జగన్, ఏపీ దళిత కూలీ రైతు సంఘ నాయకుడు దేబార్కి కిరణ్ అన్నారు. ఈమేరకు రహదారి దుస్థితిని విలేకరులకు చూపిస్తూ సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సోంపురం – వేపాడ – ఆనందపురం రహదారి అభివృద్ధికి గత ప్రభుత్వంలో ఎన్‌డీబీ నిధులు రూ. 36 కోట్లు మంజూరు కాగా.. కొంతమేర తారు రోడ్డు, కల్వర్టులు నిర్మించారు. వేపాడ, వల్లంపూడి జంట గ్రామాల్లో రోడ్డు విస్తరణ అంటూ అరుగులు, శ్లాబ్‌లు తొలగించి ఏడాదిన్నర అయినా కనీసం కాలువలు నిర్మించలేదని మండిపడ్డారు. నిత్యం ఇదే రోడ్డుపై అధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. రోడ్డు మొత్తం గుంతలతో నిండిపోవడంతో నీరు చేరి రాకపోకలకు ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మండలంలో సుమారు 55 వేల జనాభా ఉన్నారని, ప్రతిరోజూ వేల సంఖ్యలో మండల కేంద్రానికి వస్తుంటారన్నారు. ఇంతటి రద్దీ ఉన్న రోడ్డును అభివృద్ధి చేయకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేబార్కి అప్పారావు, ఏపీ దళిత కూలీ రైతు సంఘ నాయకులు, యువకులు కిరణ్, ప్రసాద్, ప్రవీణ్‌కుమార్, అబద్ధం, వెంకటరావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లే కీలకం



శిక్షణకు హాజరైన మహిళా సర్పంచ్‌లు

చీపురుపల్లి: పంచాయతీల అభివృద్ధిలో మహిళా సర్పంచ్‌లు కీలకపాత్ర పోషించాలని సామర్లకోట శిక్షణ కేంద్రం ఈటీసీ వి.జగన్నాథం అన్నారు. 'మార్పు ద్వారా విజేతలు – మహిళా సాధికారతతో స్వపరిపాలన సాధ్యం' అనే అంశంపై 2025 – 26 కార్యచరణ ప్రణాళికలో భాగంగా మూడు రోజుల పాటు మహిళా సర్పంచ్‌లకు జరగనున్న శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సాధికారతతోనే సుపరిపాలన సాధ్యమన్నారు. కార్యక్రమంలో శిక్షకులు జామి ఎంపీడీఓ ఎస్.అప్పలనాయుడు, ఎస్.కోట డిప్యూటీ ఎంపీడీఓ ఐవీ లక్ష్మి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఐ.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

వితరణ

కొత్తవలస: మండలంలోని అడ్డూరువానిపాలెం గ్రామ సమీపంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులకు శారడ కర్మాగారం యాజమాన్యం 70 పరుపులను సోమవారం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ప్రిన్సిపాల్ విజయకుమారి, కార్మాగారం ప్రతినిధి సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

వరాహ అవతారంలో జగన్నాథుడు..



శృంగవరపుకోట: పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో జగన్నాథస్వామి నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం వరాహావతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారిని దేవి స్వామికి తోటకూర నివేదించారు. కార్యక్రమంలో గౌరీ యువజన సంఘ సభ్యులు, మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఉద్యోగ విరమణ ఓ జ్ఞాపకం

శృంగవరపుకోట: ప్రతి ఉద్యోగి జీవితంలో ఉద్యోగ విరమణ ఒక తీయని జ్ఞాపకంలా మిగలాలని స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి బి.కనకలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక కోర్టులో అమీన్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ముకుందరావును సోమవారం సత్కరించారు. కార్యక్రమంలో కోర్టు సూపరింటిండెంట్ ఉపేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

బూట్లు, మాస్కుల పంపిణీ

కొత్తవలస: మండలంలోని కొత్తవలస మేజర్ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న 50 మంది పారిశుధ్య కార్మికులకు షూలు, మాస్కులు, సేఫ్టీ టోపీలు, గ్లౌజులను సర్పంచ్ మచ్చ ఎర్రయ్యరామ స్వామి చేతులమీదుగా సోమవారం పంపిణీ చేశారు. పంచాయతీ సాధారణ నిధుల నుంచి కొనుగోలు చేసినట్లు ఈఓ బి.శైలజ తెలిపారు. కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ ఎం.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా జీవించాలి

గంట్యాడ: ప్రజలు ఆరోగ్యవంతంగా జీవించాలని నేచర్ సంజీవిని ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ప్రసాద్ అన్నారు. మండలంలోని పెనసాంలో ఎస్‌బీఐ ఫౌండేషన్, నేచర్ సంజీవిని ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రోతు పాపాయ్యమ్మ, వైద్యులు లహరి, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): ఉపాధ్యాయులకు సేవలే గుర్తింపునిస్తాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు , జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనువాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. గరివిడి మండలంలోని కె. పాలవలసలో ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన మీసాల వెంకటరమణను సోమవారం సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మీసాల విజయలక్ష్మి , జెడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణ రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు మీసాల విశ్వేశ్వరరావు, కొణిశి కృష్ణంనాయుడు , శ్రీరాములునాయుడు , పొన్నాడ కుమార్, ఇప్పిలి అనంతం , వలిరెడ్డి శ్రీనివాసునాయుడు, మీసాల వరహాల నాయుడు పాల్గొన్నారు.